

2 లో

ఫాంపాండ్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు..
తొగర్పల్లి గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన..


# సంగారెడ్డి మెదక్

శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:09




## ప్రజా జ్యోతి ఎఫెక్ట్

# నోటీసులు ఒకవైపు.. అక్రమ నిర్మాణాలు మరోవైపు!

- మనసాన్పల్లి శివారులో అక్రమ వెంచర్‌పై ఎట్టకేలకు స్పందించిన పంచాయతీ అధికారులు..
- అనుమతులు లేకుండా భారీ ప్రహరీ గోడ నిర్మాణం..

## రెండో నోటీసు జారీ..

## నోటీసు జారీ చేసిన గంట గడవకముందే నిర్మాణ పనులు కొనసాగింపు?

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మన్నాన్పల్లి గ్రామ శివారులో అనుమతులు లేకుండా చేపట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారీ వెంచర్ నిర్మాణాలపై ఎట్టకేలకు పంచాయతీ అధికారులు స్పందించారు. అనుమతులు లేకుండా నిర్మించిన భారీ ప్రహరీ గోడపై రెండో నోటీసు జారీ చేసి, అక్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని, ఇప్పటికే నిర్మించిన అక్రమ ప్రహరీ గోడను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం.





**ఓవైపు నోటీసులు.. మరోవైపు పనులు!**

అధికారులు నోటీసులు జారీ చేస్తుంటే.. మరోవైపు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. నోటీసు జారీ చేసి గంట కూడా గడవకముందే అక్రమ నిర్మాణ పనులు కొనసాగితే.. అధికారుల ఆదేశాలకు విలువ ఎంత? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**రెండో నోటీసుతోనైనా ఆగుతుందా?**

ఇప్పటికే ఒకసారి నోటీసు ఇచ్చినా నిర్మాణాలు కొనసాగాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు రెండోసారి నోటీసు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే నోటీసులు జారీ చేయడం వరకే అధికారులు పరిమితమవుతారా? లేక క్షేత్రస్థాయిలో నిర్మాణాలను అడ్డుకుని, అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను తొలగించే చర్యలు చేపడతారా? అనేది వేచి చూడాల్సి ఉంది.



మిగతా 2 లో

# మహా గణపయ్యకు ఘన స్వాగతం

## - కన్సాన్‌పల్లిలో వైభవంగా మహా గణేష్ ఆగమనం..- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు





**అందోల్, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

అందోల్ మండలం కన్సాన్‌పల్లి గ్రామంలో మహా గణేష్ ఆగమనం గురువారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. 'మహదేవ్ యూత్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఆగమణ మహోత్సవంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపయ్యకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.మహా గణపయ్య విగ్రహాన్ని ఊరేగింపుగా ఈశ్వరాలయం వద్దకు తీసుకొచ్చారు. మహిళలు మంగళహారతులతో గణపయ్యకు స్వాగతం పలుకుతూ భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆవాహన మండపంలో మహా గణపయ్యను చేర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య కూష్మాండ బలి, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి గణపయ్యను ఆగమణం జరిగింది.

### భారీ విగ్రహంతో ముందస్తుగా తరలింపు

మహా గణపయ్య విగ్రహం భారీ ఎత్తులో ఉండటంతో మండపంలో అలంకరణ పనులు చేపట్టేందుకు ముందస్తుగానే విగ్రహాన్ని మండపానికి చేర్చినట్లు మహదేవ్ యూత్ నిర్వాహకులు తెలిపారు. విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు పూర్తి చేసి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఆగమణ కార్యక్రమం సందర్భంగా యువకుల సందడి, మహిళల మంగళహారతులు, భక్తుల జయజయధ్వానాలతో కన్సాన్‌పల్లి గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ వేడుకను చూసేందుకు భక్తులు తరలివచ్చారు. ఉత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు మహదేవ్ యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# నోటీసులు ఒకవైపు..

# అక్రమ నిర్మాణాలు మరోవైపు!

మొదటిపేజీ తరువాయి

### నోటీసు తేదీ ఒకటి.. అందులో తేదీ మరొకటి!

ఇక నోటీసు వ్యవహారంలో మరో అంశం చర్చనీయాంశంగా మారింది. నోటీసు జారీ చేసిన తేదీ ఒకటిగా ఉండగా.. నోటీసులో పేర్కొన్న తేదీ మరో విధంగా ఉండటం పలు ప్రశ్నలకు తావిస్తోంది. తేదీల్లో ఈ వ్యత్యాసం ఎలా వచ్చిందో సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### నోటీసులతో సరిపెట్టొద్దు.. చర్యలు తీసుకోవాలి

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కేవలం వరుసగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎలా పడుతుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఇక చూడాల్సింది ఒక్కటే.. రెండో నోటీసుతో అక్రమ నిర్మాణాలకు నిజంగా బ్రేక్ పడుతుందా? లేక నోటీసులు కాగితాలకే పరిమితమై నిర్మాణాలు యథావిధిగా కొనసాగుతాయా?పంచాయతీ అధికారులు తీసుకోబోయే తదుపరి చర్యలపై స్థానికుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# సంగారెడ్డి జిల్లా బుదేరా చౌరస్తాలో అర్ధరాత్రి దొంగలు హల్చల్..

**మునిపల్లి సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

మునిపల్లి (మం)బుదేరా చౌరస్తా లోని దాదాపు 8 ఇండ్లలో చోరీలు అర్ధరాత్రి సమయంలో తాజ్ రెస్టారెంట్ వెనకాల ఉన్న ఇళ్లల్లో చొరబడ్డ దొంగలు. ఊరికి దూరంగా ఉన్న ఇండ్లను ఎంచుకున్న దొంగలు.విషయం తెలుసుకున్న పోలీసు సంఘటన స్థలాన్నికి చేరుకుని క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు.





# ఫాంపాండ్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు..

మొదటిపేజీ తరువాయి

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండలం తొగరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఫాంపాండ్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంఎస్ఓ కొండాపూర్, ఏపీడీ జహీరాబాద్, ఎంపీడీఓ కొండాపూర్‌లతో కలిసి సీఈవో తొగరపల్లి గ్రామాన్ని సందర్శించి ఫాంపాండ్ స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఫాంపాండ్ నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులను అధికారులు పరిశీలించారు. ఫాంపాండ్ నిర్మాణం చేపట్టేందుకు స్థలం అనుకూలంగా ఉందా? తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు.గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు, భూగర్భ జలాల పెంపుతో పాటు రైతులకు ఉపయోగపడే విధంగా ఫాంపాండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది.క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఫాంపాండ్ నిర్మాణానికి సంబంధించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## శ్రీవారి సన్నిధిలో మాజీ సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ దంపతులు

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 10:**

గ్రామ ప్రజల ఆశీర్వాదంతో చందాయిపేట మాజీ సర్పంచ్ బుద్ద స్వర్ణలత భాగ్యరాజ్ కుటుంబసమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చందాయిపేట గ్రామ ప్రజలతో పాటు చేగుంట మండలంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని శ్రీవేంకటేశ్వర స్వామివారిని మనస్పూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల శ్రేయస్సు, గ్రామాభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని మాజీ సర్పంచ్ బుద్ద స్వర్ణలత భాగ్యరాజ్ పేర్కొన్నారు.



## రామాయంపేటలో ఘనంగా చాకలి ఇలమ్మ వర్ధంతి

**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో తెలంగాణ వీరవనిత చాకలి ఇలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లక్ష్మీనారాజు, బీసీ నాయకులు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం రామాయంపేట బస్‌స్టాండ్ సమీపంలో రజక సంఘం పట్టణ అధ్యక్షులు మద్దూరి కిషన్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఇలమ్మ పోరాట స్పూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, నాయకులు, పలువురు పాల్గొన్నారు.



# దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన ధీరవనిత..చాకలి ఐలమ్మ

### - తలవంచని తెగువ.. వెనక్కి తగ్గని పోరాటం..

### వీరనారి ఐలమ్మకు ఘన నివాళి







**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 10:**

తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తిలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అన్యాయానికి తలవంచకుండా పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఆమె ధైర్యం, తెగువ, ఆత్మగౌరవం నేటి తరానికి స్పూర్తిదాయకమని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం పోరాడే తత్వం ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. చాకలి ఐలమ్మ జీవితం నుంచి నేటి యువత స్ఫూర్తి పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, అర్చన, అమూల్య, జయసుధ, సునీత, వాణిశ్రీ, విజయ మోహన్ రాజ్, ఖదీర్ పాషా, రేణుక, ప్రశాంతి, రాము, బోధనేతర సిబ్బంది యాదగిరి, మహేష్, రాజు, సీఆర్‌పీలు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

# రైస్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి






**మెదక్ (ప్రజాజ్యోతి)**

మిల్లింగ్ చార్జీలు పెంచి, ఓ టి ఆర్ ను సవరించాలి: మెదక్ జిల్లా రైస్ మిల్లర్స్ జిల్లాలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, రైస్ మిల్లింగ్ పరిశ్రమను రక్షించాలని మెదక్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మిల్లర్లపై జరుగుతున్న ఒత్తిడి, వేధింపులు, దాడులను నిలిపివేయాలని కోరారు. ప్రస్తుతం పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, విద్యుత్ చార్జీలు, కార్మికుల వ్యయాలు, రవాణా ఖర్చుల కారణంగా రైస్ మిల్లింగ్ పరిశ్రమ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలిపారు. ఈ నేపథ్యంలో మిల్లింగ్ చార్జీలను తక్షణమే పెంచి మిల్లర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఒటి టి ఆర్ (అవుట్ -టర్న్ రేషియో )ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ధాన్యం మిల్లింగ్‌లో సోర్టెక్స్ వినియోగం వల్ల ఏర్పడే 15 నుంచి 20 శాతం వరకు స్టోరేజీని అనుమతించాలని కోరారు. నిబంధనలను సడలించి మిల్లర్లపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైస్ మిల్లింగ్ పరిశ్రమపై వేలాది మంది కార్మికులు, రవాణా రంగం, అనుబంధ వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయని, మిల్లుల మనుగడకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మిల్లర్లు తెలిపారు. గురువారం మెదక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్, రా రైస్ మిల్ జిల్లా అధ్యక్షుడు వీరేశం మాట్లాడుతూ, కొందరు మిల్లర్లు చేసిన తప్పులను ఆసరాగా చేసుకుని మొత్తం రైస్ మిల్ వ్యవస్థను అనుమానాస్పదంగా చూడటం, మిల్లర్లందరినీ తప్పుగా చిత్రీకరించడం సముచితం కాదన్నారు. ఏళ్ల తరబడి నిజాయితీగా సేవలందిస్తున్న వేలాది మంది మిల్లర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయవద్దని కోరారు.

**ప్రభుత్వానికి మిల్లర్ల ప్రధాన విజ్ఞప్తులు:**

ధాన్యం దుర్వినియోగం చేసిన వ్యక్తిగత మిల్లర్లపై చట్టపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. క్రిమినల్ కేసులు, వేధింపుల కంటే బకాయిలు లేదా ధాన్యం రికవరీకి ప్రాధాన్యత ఇవ్వాలి. తరుగు, డ్రైయేజ్, మిల్లింగ్ చార్జీల ఆలస్యం వంటి సాంకేతిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి సివిల్ సప్లైస్ శాఖ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. మిల్లింగ్ చార్జీలను పెంచాలి. ఓ టి ఆర్ ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాలి. సోర్టెక్స్ కారణంగా ఏర్పడే 1520 శాతం స్టోరేజీని అనుమతించాలి. రైస్ మిల్లింగ్ రంగంపై లక్షలాది మంది ఆధారపడి ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి పరిశ్రమను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శివకుమార్, రమేష్, జగదీష్, రాములు, నర్సింలు, వేణు, వీరేశం, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కొల్చారంలో అక్రమ రేషన్ బియ్యం రవాణా గుట్టురట్టు

## రూ. 143 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

**మెదక్ (ప్రజా జ్యోతి)**

కొల్చారం మండల కేంద్రంలో పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న డిసిఎమ్ వాహనాన్ని కోల్యారం పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. పోతంశెట్టిపల్లి కమాన్ వద్ద బుధవారం రాత్రి 1 గంట సమయంలో కోల్యారం ఎస్సై మొహమ్మద్ మోహినుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న ఖూ-32-ూూ-4947 నంబరు గల డిసిఎమ్‌ను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ (ఎఫ్ ఆర్ కె )తో కలిపిన 290 బస్తాల పిడిఎస్ బియ్యం (మొత్తం 143.10 క్వింటాళ్లు) ఉన్నట్లు గుర్తించారు.



**పోలీసుల విచారణ వివరాలు:**

వాహన డ్రైవర్ ముజీబ్‌ను విచారించగా, చంద్రాయణగుట్ట ప్రాంతంలోని రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు ఈ పిడిఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఈ బియ్యాన్ని మెదక్ మీదుగా బోధన్‌కు తరలించి, అక్కడ అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, డిసిఎమ్ వాహనం తనవేనని డ్రైవర్ ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ అక్రమ రవాణా వ్యవహారంలో నిందితుడిపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, తెలంగాణ స్టేట్ పిడిఎస్ కంట్రోల్ ఆర్డర్2016లోని క్లాజ్ 17(ఈ) నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ కు విరుద్ధంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్టు పోలీస్ సిబ్బంది గ్రహించి కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించగా నర్సాపూర్ మండలం లింగాపూర్ లోని తిరుమల ఆగ్రో ఇండస్ట్రీలో భద్రపరిచినట్టు తెలిపారు డీసీఎం వాహనాన్ని తదుపరి ఆదేశాల వరకు కొల్చారం పోలీస్ స్టేషన్లో ఉంచినట్లు ఎస్సై మహమ్మద్ మోహిన్ తెలిపారు.

# ఘనంగా దేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

### - కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు





**మెదక్ (ప్రజాజ్యోతి)**

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఇఫ్కో డైరెక్టర్ ఎం. దేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, శంకరంపేట మండల పార్టీ అధ్యక్షుడు పట్లోరి. రాజు, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా. నరేందర్‌తో పాటు మెదక్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివచ్చారు. పద్మ దేవేందర్ రెడ్డి దంపతులతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేవేందర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.



బీఆర్ఎస్ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ, కార్యకర్తలకు అండగా నిలుస్తున్న ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ పార్టీ కోసం మరింతగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమించాలి

### - సీఐటీయూ మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్

**వట్టిపల్లి, సెప్టెంబర్10, (ప్రజాజ్యోతి):**

వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో పేదలు, రైతులు, కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ వట్టిపల్లి మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ పిలుపునిచ్చారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. పేదల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆమె చూపిన తెగువ నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వట్టిపల్లి సర్పంచ్‌తో పాటు సీఐటీయూ నాయకులు జనార్ధన్, దాసు, భీమయ్య, గమ్య నాయక్, వెంకటేష్, లక్ష్మణ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## పత్రికలో ప్రచురించేందుకు అనుకూలంగా, అధికారుల తనిఖీకి ప్రాధాన్యత ఇస్తూ వార్తను ఇలా సెట్ చేయవచ్చు:

### - గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు..

### గిర్మాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ

### గురుకుల పాఠశాల, కళాశాలలో ఆకస్మిక తనిఖీ...



**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలను అధికారులు తనిఖీ చేశారు. సీఈఓ, మండల ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొండాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కలిసి గురు కులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతులు, పరిసరాల పరిశు భ్రత, భోజన సదుపాయాలు తదితర అంశాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, సంక్షేమం, మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. గురుకులంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

# రేషన్ దుకాణాల తూకం యంత్రాలపై విస్తృత తనిఖీలు

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:**

రేషన్ దుకాణాల్లో వినియోగించే తూకం యంత్రాలను ప్రతి సంవత్సరం తప్పనిసరిగా పరిశీలించాల్సి ఉంటుందని జహీరాబాద్ లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ సాయన్న తెలిపారు. అందులో భాగంగానే నారాయణఖేడ్ డివిజన్కు వచ్చి రేషన్ దుకాణాల్లోని తూకం యంత్రాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తనిఖీల్లో భాగంగా పరిశీలించిన తూకం యంత్రాలను నిబంధనల ప్రకారం సీల్ చేసేందుకు వచ్చామని, అయితే కొన్ని యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదని గుర్తించినట్లు తెలిపారు. తూకం యంత్రాలు సరిగా పనిచేయకపోవడంతో డీలర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. తూకం యంత్రాల మరమ్మతులు, నిర్వహణ కోసం కాంట్రాక్టు తీసుకున్న సంస్థ సక్రమంగా సేవలు అందించలేదని డీలర్లు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. యంత్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా మరమ్మతులు పూర్తయిన అనంతరం మళ్లీ తనిఖీలు నిర్వహించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటికి సీల్ వేస్తామని స్పష్టం చేశారు.రేషన్ సరుకుల పంపిణీలో తూనికలు, కొలతల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులకు సరైన తూకంతో సరుకులు అందేలా



చూడటమే తనిఖీల ప్రధాన ఉద్దేశమన్నారు. గతంలో ఇన్చార్జి ఇన్స్పెక్టర్ ఉండటంతో తనిఖీలు ఆశించిన స్థాయిలో జరగలేదని, ప్రస్తుతం రెగ్యులర్ పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో రేషన్ దుకాణాలతో పాటు తూనికలు, కొలతలకు సంబంధించిన ఇతర దుకాణాలు, వ్యాపార సంస్థల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# వినాయక మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

## -ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి

## -నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:**

వినాయక చవితి సందర్భంగా పట్టణం, గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం సూచించారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..వినాయక మండపాల ఏర్పాటుకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఆన్లైన్ అనుమతి విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. నిర్వాహకులు తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్ ద్వారా మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేసి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.




# ఎస్జీఎఫ్ క్రీడోత్సవాలు ప్రారంభం

## మండల స్థాయి పోటీల్లో భారీగా పాల్గొన్న విద్యార్థులు






**అందోల్, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

అందోల్-జోగిపేట మున్సిపల్ గ్రౌండ్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) మండల స్థాయి క్రీడోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ క్రీడా పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్రెడ్డి, మార్క్ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్రెడ్డి, ఎంఈఓ కృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య, హెచ్ఎం నరేష్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నరోత్తం, పీఈటీ మండల అధ్యక్షుడు సుభాష్గౌడ్, పీఈటీలు శ్రీనివాస్, రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అందోలు మండల వ్యాప్తంగా ఐలమ్మకు ఘన నివాళులు

## - వీరనారి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్న నాయకులు

**అందోలు, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని అందోలు మండల వ్యాప్తంగా గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళు లర్పించారు. పలుచోట్ల ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆమె సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. పేదలు, రైతులు, మహిళల హక్కుల కోసం ఆమె చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



# విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి:**

సిర్గాపూర్ మండల కేంద్రంలోని కస్తూరిభ గాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలలోని 30 మంది విద్యార్థులకు గురువారం ఆప్తాల్మిక్ లక్ష్మినారాయణ ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్ లు,అధ్యాపకులు, ఆసుపత్రి సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

## - తూకం యంత్రాల మరమ్మతులకు టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాలి - డీలర్ తహేర్ అలీ






**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డీలర్ తాహేర్ అలీ డిమాండ్ చేశారు. గురువారం నారాయణఖేడ్ సివిల్ సప్లై గోదాంలో తూకం యంత్రాలకు సీల్ వేసేందుకు వచ్చిన అధికారుల ఎదుట డీలర్లు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా తాహేర్ అలీ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో సుమారు 180 మంది రేషన్ డీలర్లు ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్ల క్రితం డీలర్లకు తూకం యంత్రాలను అందించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు చెడిపోయిన యంత్రాలను మరమ్మతు చేసేందుకు సంబంధిత టెక్నీషియన్లు అందుబాటులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో డీలర్లే సొంత ఖర్చులతో ఒక్కో తూకం యంత్రానికి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వెచ్చించి మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం తూకం యంత్రాలకు సీల్ వేస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో యంత్రాలు చెడిపోతే వాటిని ఎలా మరమ్మతు చేయించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ సమస్యను డీఎస్ఓ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థలు సమయానికి తూకం యంత్రాలను మరమ్మతు చేయకపోవడంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాగే పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా తూకం యంత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీలర్ల సమస్యల పరిష్కారానికి అవసరమైన చోట్ల టెక్నీషియన్లను అందుబాటులో ఉంచి, చెడిపోయిన తూకం యంత్రాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.

# పౌష్టికాహారమే ఆరోగ్యానికి పునాది

## - కన్సాన్‌పల్లిలో ఘనంగా పోషణ మాసం..

## - గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన





**అందోల్, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):** ఆరోగ్యకరమైన తరానికి పునాది బాల్యంలోనే పడుతుందని, పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించడంలో కుటుంబంతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని జోగిపేట సీడీపీఓ మధులిక, కన్సాన్‌పల్లి సర్పంచ్ సునీత మహిపాల్ అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా అందోల్ మండలం కన్సాన్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీఓ మధులిక మాట్లాడుతూ "పోషకాహారం ప్రతి ఇంటి అలవాటుగా మారినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుంది" అన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల ఆహారం ఎంతో అవసరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సర్పంచ్ సునీత మహిపాల్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కుటుంబం పిల్లల ఆరోగ్యం, పోషణపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు, పండ్లను ఆహారంలో భాగం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలతో తల్లుల్లో పోషకాహారంపై మరింత చైతన్యం తీసుకురావాలని అన్నారు.కార్యక్రమంలో కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. సీనియర్ అసిస్టెంట్ సంగీత, అంగన్‌వాడీ టీచర్లు రామకళ, సాయమ్మ, రమాదేవి, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి బాధితులు వివరాలు నమోదు చేసుకోవాలి

## -నష్టపరిహారం పొందేందుకు తహసీల్దార్‌ను సంప్రదించాలి -ఆర్ఐ మాధవరెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** జాతీయ రహదారి 161బి నిజాంపేట్ నుంచి బీదర్ వరకు కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా భూములు, ఆస్తులు కోల్పోతున్న బాధితులు తమ వివరాలను నమోదు చేసుకుని నష్టపరిహారం పొందాలని నారాయణఖేడ్ ఆర్ఐ మాధవరెడ్డి సూచించారు.గురువారం నారాయణఖేడ్ పట్టణంలో జాతీయ రహదారి పనులకు సంబంధించిన ప్రాంతాలను, భూములు కోల్పోతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాధవరెడ్డి మాట్లాడుతూ..రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హత కలిగిన ప్రతి బాధితుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూములు కోల్పోతున్న బాధితులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ తదితర అవసరమైన పత్రాలతో తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. నష్టపరిహారానికి సంబంధించిన సందేహాలుంటే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీపీఓ సుధాకర్, జాతీయ రహదారి 161బి వర్క్ ఇన్స్పెక్టర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.




# షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహంలో దుప్పట్ల పంపిణీ

**మునిపల్లి సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):** గురువారం రోజున మునిపల్లి లోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లు, కార్పెట్లు మరియు ట్రంక్ బాక్సులు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్ప పంపిణి చేశారు. మెను ప్రకారం నాణ్యమైన భోజనం తో పాటు, విద్య అభివృద్ధిలో కృషి చేస్తున్న హాస్టల్ సిబ్బంది పట్ల సంతోషం వ్యక్తం చేశారు.





# ఆర్థిక వృద్ధిలో దూసుకుపోతున్న మెదక్ జిల్లా: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ (ప్రజాజ్యోతి)**

జిల్లా ఆర్థిక వృద్ధి రేటులో మెదక్ జిల్లా వేగంగా దూసుకుపోతోందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి త్రైమాసికంలో నిర్దేశించుకున్న రుణ లక్ష్యాలను చేరుకోవడంలో బ్యాంకర్లు, జిల్లా యంత్రాంగం చక్కటి సమన్వయంతో పనిచేశాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని మినీ మీటింగ్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందడంలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.మొదటి త్రైమాసికంలో నిర్దేశించిన లక్ష్యంలో 24.33 శాతం పూర్తి చేయడం బ్యాంకర్ల సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయం, స్వయం సహాయక సంఘాలు ( ఎస్ హెచ్ జి ఎస్ ), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ( ఎమ్మెస్ ఎం ఈ ) రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ పంపిణీ చేసిన ఈ రుణాలు జిల్లా ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం తరహాలోనే ఈ ఏడాది కూడా బ్యాంకర్లు, జిల్లా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న మోసాల దృశ్య వినియోగదారుల కు భద్రత కల్పించేందుకు కేవైసీ సురక్షిత బ్యాంకింగ్ అడుగు పేరుతో జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు పాత ఖాతాలో పేరుకుపోయిన లేదా క్లైమ్ చేయని డిపాజిట్ ల వివరాలను తెలుసుకోవడానికి గూగుల్ ఉద్గం పోర్టల్ ఉపయోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు జీరో బ్యాలెన్స్ సేవింగ్ ఖాతాదారుల ఆధార్ పాన్ కార్డులతో తమ ఖాతాలను అప్డేట్ చేసుకోవాలని సూచించారు రుణాలు ఇవ్వడమే కాకుండా ఇచ్చిన రుణాల సకాలంలో తిరిగి వసూలు అయ్యేలా చూడాలని అధికారులను కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశించారు స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణాలను వ్యాపార అభివృద్ధికి వాడుకొని సకాలంలో చెల్లించి బ్యాంకులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ ఆర్బిఐ ప్రతినిధి హేమలత నాబార్డ్ డిడిఎం కృష్ణ చైతన్య వివిధ బ్యాంకుల ఏజీఎంలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డీజేలకు నో.. భద్రతకు ఓకే

- గణేష్ ఉత్సవాలపై పోలీసుల స్పష్టమైన ఆదేశాలు .
- నిబంధనలు పాటిద్దాం.గణేష్ ఉత్సవాలను సురక్షితంగా నిర్వహిద్దాం. ఎస్. ఐ. రవి గౌడ్

**కల్హేర్, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్ సూచించారు.వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జనం కోసం నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. అధికారిక ఆన్‌లైన్ ఇన్‌టిమేషన్ ఫారం ద్వారా మండపానికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు.మండపాల వద్ద బారికేడింగ్, తగిన లైటింగ్, భద్రతా ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనం సందర్భంగా చెరువులు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక రద్దీకి తావివ్వకుండా నిర్దేశించిన నిమజ్జన ప్రదేశాలను మాత్రమే వినియోగించాలన్నారు. అధిక శబ్దంతో కూడిన డీజేలు, హై-డెసిబెల్ సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, డీజేలకు నిషేధం ఉందని స్పష్టం చేశారు.ఊరేగింపుల సమయంలో అత్యవసర నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రవిగౌడ్ కోరారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ వినాయక చవితిని ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



# గొల్లపల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

- వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం..
- అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయం
- సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఘనంగా నివాళులు**



చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గ్రామ ప్రజలు, రజక సంఘం నాయకులు ఆమె సేవలను స్మరించుకున్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రజక సంఘం అధ్యక్షులు, సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన కుటుంబం

- అందోలు అంగన్‌వాడీ కేంద్రంలో 9వ పోషణ మాస కార్యక్రమం

**అందోలు, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**



గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు అందోలు అంగన్‌వాడీ కేంద్రంలో 9వ పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. జోగిపేట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిశిశు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, తల్లులు రోజువారీ ఆహారంలో పౌష్టిక విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు, గుడ్లు తదితరాలను చేర్చుకోవాలని సూచించారు. చిన్నారులకు వయసుకు తగిన పౌష్టికాహారం అందించడం ద్వారా ఎదుగుదల, ఆరోగ్యం మెరుగుపడతాయని వివరించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూపరాణి, ఉమారాణి, శారద, వెంకటమ్మ, బాలమణి, లలిత, లక్ష్మి, ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు

## - రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

## - కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

## - సన్నాహక సమావేశంలో అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ దిశానిర్దేశం







**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:-**

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సజావుగా సేకరించేందుకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. 202627 వానాకాలం సీజన్‌లో వరి ధాన్యం సేకరణకు సంబంధించి గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి సంబంధిత శాఖల అధికారులు, రవాణా కాంట్రాక్టర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. దీనికి అనుగుణంగా జిల్లాలో 227 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సన్న రకంకు దొడ్డు రకం ధాన్యానికి అవసరమైన విధంగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల పంట దిగుబడి చేతికందే సమయానికి ఆయా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తి మద్దతు ధర పొందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు తదితరాలను తగినంతగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. తూకం, తరుగు తదితర అంశాల్లో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తగిన సంఖ్యలో రవాణా వాహనాలను ముందుగానే సమకూర్చుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన ప్రదేశాలను/ గోడౌన్లను గుర్తించాలని అధికారులకు సూచించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు. ధాన్యం సేకరణ ప్రారంభమైనప్పటి నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్. సాంగీత, డీఎస్ఓ బాలసరోజ, సివిల్ సప్లయిస్ డీఎం జయశ్రీ, డీసీఓ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా మార్కెటింగ్, రవాణా, డీఆర్డీఓ, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో తప్పుల సవరణకు ప్రత్యేక కార్యక్రమం

## - నోటీసులు అందుకున్న ఓటర్ల ధ్రువపత్రాల పరిశీలన

## - వివరాల్లో వ్యత్యాసాల గుర్తింపు.. సవరణల అనంతరం తుది ఓటరు జాబితా

## - ప్రతి ఓటు కీలకం.. ప్రజలు సహకరించాలి : తహసీల్దార్ అశోక్..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో నమోదైన పేర్లు, వ్యక్తిగత వివరాల్లో ఉన్న తప్పులు, వ్యత్యాసాలను సరిచేసి తుది ఓటరు జాబితాను రూపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తెలిపారు. గురువారం కొండాపూర్ మండలంలోని చెర్లగోపులారం, మమ్మదాపూర్ గ్రామాల్లో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న దరఖాస్తుదారులు తమకు సంబంధించిన ఆధారాలు, ధ్రువపత్రాలతో హాజరుకాగా అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

### ధ్రువపత్రాల పరిశీలన.. వివరాల సవరణ

ఓటర్ల పేర్లు, ఇతర వివరాల్లో ఉన్న వ్యత్యాసాలను గుర్తించి, అందుబాటులో ఉన్న ఆధారాల మేరకు అవసరమైన సవరణలను చేపట్టారు. సవరించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, సంబంధిత ప్రక్రియను పూర్తి చేసి తుది ఓటరు జాబితా రూపకల్పనకు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసీల్దార్

తహసీల్దార్ అశోక్ స్వయంగా కార్యక్రమంలో పాల్గొని సవరణల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటరు జాబితాలో గుర్తించిన తప్పులు, వ్యత్యాసాలను నోటీసుల ద్వారా సంబంధిత ఓటర్లకు తెలియజేస్తున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న వారి నుంచి ఆధారాలు, ధ్రువపత్రాలు స్వీకరించి పరిశీలించిన అనంతరం అర్హత మేరకు వివరాలను సరిచేసి తుది జాబితాను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.




### ఓటర్లు సహకరించాలి

ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, నోటీసులు అందుకున్న వారు సంబంధిత ఆధారాలతో హాజరై సవరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ అశోక్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసేందుకు గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ అనసూయ, సర్పంచ్ మహేశ్వరీ, సతీష్, ఎంపీడీఓ సౌమ్యశ్రీ, గొల్ల రాములు, కిష్టయ్య, వార్డు సభ్యుడు రవీందర్, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఓటర్లు పేర్లు నమోదు చేసుకోవాలి

## -7వ వార్డు కౌన్సిలర్ విజయ్ బుజ్జి పిలుపు

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:**

1 అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కొత్త ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని 7వ వార్డు కౌన్సిలర్ విజయ్ బుజ్జి కోరారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..అర్హత కలిగిన ప్రతి యువకుడు, యువతి తమ ఓటు హక్కును పొందేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.కొత్త ఓటర్లు తమ ప్రాంతంలోని బూత్ స్థాయి అధికారి లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి ఫారం-6ను పూర్తి చేసి, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు. అలాగే తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు ప్రతిని మున్సిపల్ కార్యాలయంలో లేదా సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందజేయాలని సూచించారు.

**ఓటరు నమోదుకు అవసరమైన పత్రాలు:**

పదో తరగతి ధ్రువపత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు,



మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, స్వీయ ప్రకటన పత్రం అవసరం. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని ఆయన అన్నారు.

# మండలంలో ఘనంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ప్రారంభం





**రాయికోడ్ సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి నరసింహులు, ఎస్సై చైతన్య కిరణ్, ఎంపీడీవో షరీఫ్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, ఐక్యత, పోటీతత్వ స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు తదుపరి స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, పాఠశాలల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ

**మునిపల్లి సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**



సంగారెడ్డిలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్,జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం సుధాకర్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవితదితరులు పాల్గొన్నారు. "ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం మన పోరాటం కొనసాగుతుంది.

# సదాశివపేట పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పారునంది రాఘవేందర్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సదాశివపేట పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పారునంది రాఘవేందర్ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మరియు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఈ మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన నిర్మలా జగ్గారెడ్డికి, జగ్గారెడ్డికి పారునంది రాఘవేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు...



# చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు

**మునిపల్లి సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరతెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారిచిట్యాలఐలమ్మ41వ,వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో. జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు గారు. వెనుకబడిన తరగతుల ఆర్థిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీష్. గ్రంథాలయ చైర్మన్ అంజయ్య. మున్సిపల్ చైర్మన్. వనిత సంతోష్. కల్లుగీతకార్మికసంఘంజిల్లా ప్రధానకార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు రామ గౌడ్ వెంకటేష్ గౌడ్. రజక సంఘం జిల్లా అధ్యక్షులు నామాల నగేష్. వివిధ కుల సంఘాల జిల్లా నాయకులు. జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



